ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది:09.04.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కార్పొరేట్ సంస్థలు సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
2. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేసేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
3. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
4. కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది జాతీయ నాయకులు ఎన్ఎస్ యూఐ నుంచే ఎదిగారని ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు.

------------------------------------------

**రేవంత్**

సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి పలు కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో

తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని ముఖ్యమంత్రి అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు.

**డెస్క్**

----------------------------------

**పొన్నం**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్ లో జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమతా కిచెన్ ను ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్లు, ట్రాన్స్ జెండర్లకు ERS చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు, వృద్ధులకు అండగా ఉంటామన్నారు.

**పీటీసీ - హైదరాబాద్**

-------------------------------------

**విమానాశ్రయం**

తెలంగాణలోని ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలోని 360 ఎకరాల ఎయిర్‌స్ట్రిప్‌కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 450 ఎకరాలు అప్పగిస్తే పూర్తిగా తమ శాఖ ఆధ్వర్యంలోనే ఎయిర్‌పోర్టు నిర్మించి పౌరసేవలకు అనుకూలంగా ఒక ఎన్‌క్లేవ్ నిర్మించుకోవడానికి పౌరవిమానయానశాఖకు అనుమతిస్తామని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణ అంశంపై కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు గోడం నగేశ్, పాయల్‌శంకర్, ఆదిలాబాద్ కలెక్టరు నిన్న ఢిల్లీలో రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ విషయాలు తెలిపారు. తాను పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వరంగల్, కొత్తగూడెంతో పాటు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు

నిర్మించాలని కోరారని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. కిషన్ రెడ్డి చొరవతో గతంలోనే రక్షణశాఖ సూత్రప్రాయ అంగీకార లేఖ ఇచ్చిందని తెలిపారు. ఈనెల 17వ తేదీన పౌరవిమానయాన, రక్షణశాఖ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి ఓఎల్ సర్వేచేసి మాస్టర్‌ప్లాన్ తయారుచేస్తాయని, రక్షణశాఖ అంగీకరించగానే శంకుస్థాపన చేస్తామన్నారు.

డెస్క్

----------------------------------

**ఎస్ఎస్ యూఐ**

హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. ఎన్ఎస్ యుఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీ చంద్ రెడ్డి, ఎంపీ అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఎన్ఎస్‌యూఐ తన మాతృ సంస్థ అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక జాతీయ నాయకులు ఎన్ఎస్‌యూఐ నుంచి ఎదిగారని తెలిపారు. కష్టపడి పని చేస్తే పార్టీ తప్పక గుర్తింపు ఇస్తుందని ఆయన అన్నారు.

డెస్క్

-----------------------------------

**ఆలె నరేంద్ర**

దివంగత ఆలే నరేంద్ర 12వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని బీజేపీ కార్యాలయంలో ఈరోజు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు, అన్యాయానికి వ్యతిరేకంగా నరేంద్ర అహర్నిశలు పోరాడిన ధైర్యవంతుడని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ నరేంద్ర కీలక పాత్ర పోషించారని, కార్మిక హక్కుల కోసం ట్రేడ్ యూనియన్ నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు.

డెస్క్

-------------------------------------

**పొంగులేటి**

ఇటీవలి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, పలువురు మంత్రులపైనా బీఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు, కే తారక రామారావులు చేస్తున్న పలు ఆరోపణలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా స్పందించారు. నిన్న సాయంత్రం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కే చంద్రశేఖర్ రావు మార్గదర్శకత్వంలోనే వారు సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గత పదేళ్ల పాలనలో అవినీతికి పాల్పడ్డారని, ఆ బురదను ఇప్పుడు తమకు అంటించాలని చూస్తున్నారని ఆరోపించారు. నాదర్గుల్, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడ తదితర అంశాలపై మంత్రి ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టారు.

డెస్క్

---------------------------------

**టీజీఎస్ఆర్టీసీ**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ బ్యాంకులో శాలరీ అకౌంట్ కలిగిన తెలంగాణ ఆర్టీసీ సిబ్బందికి 10 లక్షల రూపాయల సహజ మరణ బీమాను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. ఈ సౌకర్యం కోసం ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈనెల ఒకటో తేదీ నుంచే ఈ నిబంధన అమలులోకి వచ్చింది. ఇప్పటికే అందుతున్న 1 కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కూడా యథాతథంగా కొనసాగుతుంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి ప్రత్యేక సూచనల మేరకు యూనియన్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. దీని వల్ల 38 వేల మందికి పైగా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.

డెస్క్

------------------------------------

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక - జనగామ**

99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన కోసం ఈరోజు జనగామలో రెడ్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ....

**బైట్ - కలెక్టర్**

**పీటీసీ – జనగామ**

---------------------------------

**స్మార్ట్ ఫోన్లు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 586 అంగన్వాడి కేంద్రాలకు కొత్తగా స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్నట్లు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం చెప్పారు.. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.....

**బైట్ - లక్ష్మీరాజం**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**బదిలీలు**

కామారెడ్డి జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ, పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర ఆదేశాలు జారీ చేశారు. ఆరుగురు సబ్ ఇన్స్పెక్టర్లను అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వారిలో గాంధారి ఎస్ఐ బి.అంజనేయులు, బిర్కూర్ ఎస్ఐ ఎం. మహేందర్, జుక్కల్ ఎస్ఐ కె. నవీన్ చంద్ర, బాన్సువాడ ఎస్ఐ బి. మురళి, బాన్సువాడ ఎస్ఐ వి.కె. రాములు, పిట్లం ఎస్ఐ టి. వెంకట్రావు ఉన్నారు.

**పీటీసీ - కామారెడ్డి**

--------------------------------

**నిజామాబాద్**

ఎస్సీ నిరుద్యోగ యువత కోసం పాడి గేదెల స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించినట్టు నిజామాబాద్ షెడ్యూల్డ్ కులాల సేవా సహకార

అభివృద్ధి సంస్థ లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకురాలు శ్రీదేవి తెలిపారు. దీని కోసం అవసరమైన సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**పీటీసీ - నిజామాబాద్**

--------------------------------

**ఇందిరమ్మ ఇళ్లు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు 40 శాతం పూర్తి చేసి రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, జిల్లా హౌజింగ్ పీడీ వెంకట మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్దిదారులకు ప్రజా ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోందన్నారు. ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటిదాకా 161 కోట్ల రూపాయలకు పైగా జమ చేసినట్లు చెప్పారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-----------------------------

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఈరోజు రెండు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోకూడదనె ఉద్దేశంతో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**పీటీసీ - జోగులాంబ గద్వాల**

------------------------------------

**CRPF శౌర్య దివస్**

ఈరోజు CRPF శౌర్య దివస్ జరుపుకుంటున్నారు. 1965 ఏప్రిల్ 9న గుజరాత్‌లోని సర్దార్ పోస్ట్ వద్ద పాకిస్థాన్ సైన్యంపై CRPF చిన్న బృందం సాధించిన చారిత్రాత్మక విజయాన్ని, వారి అసమాన ధైర్యసాహసాలను గుర్తుగా ప్రతి సంవత్సరం ఈదివస్ ను జరుపుకుంటారు.

**జీఎస్**

------------------------------------